దేశంలోని దేవకన్యలు

ఆస్పత్రి వరండాలో అటూ యిటూ తిరుగుతున్నాను— యేం చేయడానికీ తోచక. ఇంకో గంటవరకూ డాక్టర్‌కు పని తెమలేటట్లు లేదు — పరీక్ష చేయించుకోవలసిన రోగులు యింకా పదిమంది దాకా వున్నారు. ఆ ఆస్పత్రి వున్నది వూరిబయట. అటు వూర్లోకిగాని, ఇటు వూరి బయటకు గానీ షికారు పోదామనుకుంటే అంతా బురదే.

అసలు ఆ వర్షంతోనే ఆనాడు నేనా వూర్లో యిరుక్కోవలసి వచ్చింది. ఆ వూరికి రోడ్డంటూ ఒకటుంది. ఆ రోడ్డుమీద బస్సుకూడా ఒకటుంది, రోజుకు ఒకసారి అటూ, ఒకసారి యిటూ. అసలే ఆ బస్సుకు టైం ప్రకారం నడవాలనే పట్టుదలలేదు; యిక వర్షం వస్తే చెప్పకుండానే సెలవు పెడ్తుంది; ఆ సెలవు ఒకరోజు కావచ్చు, పది రోజులు కావచ్చు. అందులో ఆ బస్సును అనవలసిన పనికూడా లేదు — ఆ రోడ్డు అటువంటిది. ఆ రోడ్డు వున్నది బస్సులు నడవడానికికాదు—బస్సులను పరీక్షించడానికి—భక్తులను పరీక్షించడానికి భగవంతుడున్నట్లు. ఆ బస్సు నడిచిననాడూ, నడవనినాడూ కూడా, ప్రయాణికుల మీద కసి తీర్చుకుంటుంది — భక్తులు కీర్తనలు వ్రాసీ, పాడీ, ప్రజల సంగీత అభిరుచులమీద కసి తీర్చుకున్నట్లు.

చేసేదిలేక ఆస్పత్రి వరండాలో అటూ యిటూ తిరుగుతున్నాను — డాక్టర్‌మీద విసుక్కుంటూ. నిన్న ఉదయమే పోతానంటే డాక్టరే నన్ను బలవంతంగా ఆపినాడు. ఆ బస్సు యిక రెండు మూడు రోజులు వచ్చేటట్లు లేదు. అంత వరకూ నేనీ దిక్కులేని కొంపలో దినాలు గడపక తప్పదు.

బాల్యస్నేహితుడు డాక్టర్ మూర్తి వుండబట్టిగానీ, లేకపోతే యీ వూరు చూడవలసిన దురవస్థ నాకీ జన్మలో పట్టేదికాదు. యీ పాడు వూర్లో మూర్తి యెందుకున్నాడో నాకెప్పుడూ ఆశ్చర్యమే. ఆశ్చర్యమే కాదు — కోపం గూడా. యే టౌనులో ప్రాక్టీసు పెట్టుకున్నా యింత పదంతలు సంపాయించగలడు — యింత నూరంతలు సుఖపడగలడు. యీ మాటే నేను మూర్తితో యెన్నిసార్లో అన్నాను. కానీ చిరునవ్వు నవ్వడం తప్ప యే సమాధానమూ చెప్పడు. ఆ చిరునవ్వుకూడా యేదో వింతగా వుంటుంది — నీకు అర్థం కాదులే అన్నట్లు. లేక ఆ చిరునవ్వు వెనుక విచారమో, విషాదమో వుందేమో ?

ఈ రోజైనా నిలదీసి అడుగుతాను — యీ నరకకూపం వదలి పెడ్తావా — లేక — లేక — వదలిపెట్టకపోతే యేమని బెదిరించాల్నో నాకే తెలియలేదు. పోనీ తన భార్యా బిడ్డల కోసమైనా వదలిపెట్టమని చెప్తాను. యేముందీ వూరిలో ? ఒక వింత లేదు — ఒక వినోదం లేదు — సంస్కారం లేదు — నాగరికత లేదు — ఒక సంఘం లేదు — ఒక స్నేహితుడు లేడు — కనీసం చదువుకుందామనుకుంటే ఒక పుస్తకంకూడా దొరకదు — పట్టి పల్లెకొంప. వర్షం వస్తే అంతా బురద. గాలి వీస్తే అంతా దుమ్ము. అదీ కాకపోతే అలవిగాని యెండ. పగలంతా యీగలు, రేయంతా దోమలు. యెప్పుడూ వూర్లో యేదో వొక రోగం వుంటుంది — మశూచో, మలేరియానో, మరొకటో, మరొకటో. యిది మనుషులు వుండదగిన ఊరేకాదు — అసలు యీ ఊరిలో వున్నది మనుషులేనా అని అనుమానం — అసలు యిది ఊరేనా అని ? యిది నరకలోకానికిమాడల్ — యిది మానవ నాగరికతకు మచ్చ — మానవ చరిత్రకు అపచారం — మానవుని మర్యాదకు కళంకం.

ఆవేశం యెక్కువైనందువల్లనేమో ఆలోచన హఠాత్తుగా ఆగి

పోయింది. నా ఆవేశానికి నేనే నవ్వుకుంటూ గడియారం చూసుకున్నాను— యింకా పది కాలేదు. సిగరెట్ అంటించుకుంటూ నిలబడి ఊరి వైపు చూసినాను.

ఒక్క క్షణం నా కండ్లను నేనే నమ్మలేక పోయినాను. కండ్లు మూసి మళ్లీ తెరచినాను — మళ్లీ అదే దృశ్యం — యెవరో దేవకన్య ! యిటువైపు వస్తూ వుంది — మెల్లగా అడుగులు వేసుకుంటూ—వయ్యారంగా అడుగుతీసి అడుగు పెడ్తూ — అది నడకకాదు — నృత్యం. దేవకన్య నా వైపే వస్తూ వుంది. ఆమె ధరించినవి మణిమయాంబరాలు — చెవులలో శతకోటి సూర్యప్రభలు — తలమీది వెంట్రుకలలో వెలుగునీడల రాస క్రీడలు — ముఖంలో అపూర్వమైన తేజస్సు — అతిలోకమైన సౌందర్యం. దేవకన్య నా వైపే వస్తూవుంది. అనిమేష దృష్టితో ఆమెవైపే చూస్తూ వున్నాను. ఆమె మెల్లగా వస్తూనే వుంది. నా వైపే వస్తూవుంది. దగ్గరకు వచ్చేకొద్దీ ఆకారం స్పష్టమౌతూవుంది. అవిగో విచ్చిన గులాబీల వంటి చెంపలు, చెంపకు చేరెడేసి కన్నులు, తీర్చిదిద్దిన నల్లని కనుబొమలు. ఆఁ—కాదు — ఆమె దేవకన్య కాదు. దగ్గరకు వచ్చే కొద్దీ తేలిపోయింది. ఆమె దేవకన్య కాదు — మామూలు మానవ కన్య.

నిన్న వచ్చిన వర్షం వలన గాలిలో దుమ్మూ ధూళీ లేక వాతావరణం పరిశుభ్రంగా వుండడమూ, ఉదియం పదిగంటలే ఐనా ఎండ తీవ్రంగా వుండడమూ, ఆ పరిశుభ్రమైన వాతావరణంలో సూర్యుని తీక్షణ కిరణాలలో ఆ అమ్మాయి వేసుకున్న చౌకరకం లినన్ గుడ్డల మిలమిలా, చెవులలోని రంగూన్ రాళ్ళ తళతళా నాకేదో భ్రమ కల్పించినట్లుంది. ఆ వూరిమీద నా మనసులో కలిగిన అనవసరమైన ఆవేశంకూడా ఆ భ్రమకు కొంత కారణమేమో. కారణమేమైనా ఆ అపూర్వమైన భ్రమ ఆ నిమిషం సేపూ నన్ను సంపూర్ణంగా లోబరచుకుంది. మరు నిమిషంలోనే భ్రమ

వదలిపోయినా ఆ దివ్యసౌందర్యమూ ర్తి నా హృదయంలో గాఢంగా హత్తుకుపోయింది.

క్రమంగా ఆ అమ్మాయి దగ్గరకు వస్తూవుంది — మెల్లగా వస్తూ వుంది — అడుగులో అడుగు వేసుకుంటూ వస్తూ వుంది; కానీ ఆ నడక నృత్యంకాదు — యౌవనభారంచే కలిగిన మందయానమూ కాదు. ఆ నడకలో యేదో అసహజత్వం వుంది. నడకలో ఉత్సాహం లేదు — కదలికలో ఉల్లాసం లేదు — అడుగు తీసి అడుగు పెట్టడంలో ఆనందం లేదు.

ఆ అమ్మాయి మరికొంత దగ్గరకు వచ్చింది — బరువుగా నడుస్తూ. ఆ అమ్మాయి జబ్బుగా వున్నట్లుంది. ఔను — ఆమె ఆరోగ్యం బాగ లేదు — అందుకే అంత బరువుగా నడుస్తున్నది. అదుగో యేదో చేతిలో సీసా వుంది — మందుకోసమేమో ఆస్పత్రికి వస్తూ వుంది — లేకపోతే ఆస్పత్రికి రావలసిన పని యేముంది?

ఆ అమ్మాయి యిప్పుడు చాలా దగ్గరకు వచ్చింది. వయస్సు పంద్రెండేండ్లు వుండవచ్చు. పల్లెటూరి పిల్లే అయినా చక్కని ముక్కు— విశాలమైన కండ్లు — దీర్ఘములైన కనుబొమలు — కోల ముఖం — కొన దేలిన గడ్డం — ఉన్నతమైన నొసలు. కానీ అన్ని అవయవాల్లోనూ అనారోగ్యం తాండవిస్తూ వుంది, చిక్కి శల్యములైన చేతులు — కాంతి లేని కండ్లు —కళ లేని ముఖం — పాలిపోయిన చెక్కిళ్లు — ఆకర్షణలేని శరీరం — ఆనందం లేని నడక.

ఆ అమ్మాయి ఆస్పత్రిలోకి పోయింది — బరువుగా — బాధగా — కాళ్ళీడ్చుకుంటూ. నా గుండెలు బరువెక్కినాయి — నా మనసులో బాధ బయలుదేరింది. దేవకన్యగా, పుడమికి దిగిన సౌందర్య దేవతగా, ఒక

నిమిషం నన్ను మైమరపించింది ఈ బాలికేనా ? — మృత్యుముఖంలో వున్న ఈమర్త్య బాలికేనా ? "మృత్యుముఖంలో" అన్న ఆలోచన రాగానే భయంతో నా ఒళ్లు జలదరించింది. ఈ అమ్మాయి మృత్యుముఖంలో వుందా ? సంపూర్ణారోగ్యంతో దివ్యసుందర మూర్తిగా వుండవలసిన యీ బాలికకు మృత్యువాసన్నమైందా ? యే పాపమూ యెరుగని యీ పవిత్ర మూర్తి మరణావస్థలో వుందా ? నాకు ముచ్చెమటలు పోసినాయి. మృత్యువు నన్నే వెంటబడినట్టు — లోకమే ప్రళయోన్ముఖమైనట్లు — ఆ అమ్మాయి మరణానికి నేనే కారణమైనట్లు — ఏదో బాధ — ఏదో అనుతాపం — కార్చిచ్చువలె నా సర్వాంగాలనూ దహిస్తూవుంది.

ఆ స్థితిలో యెంతసేపు వున్నానో తెలియదు. ఆ ఆమ్మాయి ఆస్పత్రిలో నుండి బయటికి వచ్చి వూరిముఖం పట్టింది. చేతిలోని సీసాలో యేదో మందు వుంది. మూర్తి చాలా చిత్తశుద్ధి గల డాక్టరు — మంచి మందే యిచ్చి వుంటాడు — ఆ అమ్మాయి జబ్బు తప్పక నయమౌతుంది. యెంత జబ్బు ఐతే మాత్రమేమి ? ఈ కాలంలో మందుకు లొంగని రోగమే లేదు. ఆ అమ్మాయి క్రమంగా దూరమౌతూ వుంది, చిక్కిపుల్లలవలె వున్న చేతులు — సాగిన మెడ — సగం ఊసిపోయిన జుట్టు — క్రమంగా అస్పష్టమౌతున్నాయి.

"ఏమోయ్ ఆ అమ్మాయివైపు అంతగా చూస్తున్నావ్ ?" డాక్టర్ ప్రశ్నకు ఉలికిపడినాను. మూర్తి ఎప్పుడు వచ్చి నా ప్రక్కన నిలబడినాడో గమనించనేలేదు.

"యెవరు మూర్తీ ఆ అమ్మాయి ?" అన్నాను డాక్టరు వైపు చూస్తూ.

"యేం ? చాలా అందంగా వుంది కదూ ?"

ఆ అమ్మాయి అందాన్ని గురించి డాక్టర్ నాతో ఏకీభవించినందుకు తృప్తితో తల ఆడిస్తూ అన్నాను : "ఔను – చాలా అందంగా వుంది. యెవరా అమ్మాయి ?"

"నేనీ ఊరిలో పదేండ్లనుండీ వున్నాను. యింత అందమైన అమ్మాయిని యెన్నడూ చూడలేదు. కానీ యీఅందం యెన్నాళ్లుంటుందో ?"

"యేం మూర్తీ ?"

"ఆ అమ్మాయికి క్షయ."

"ఆఁ !" ఆశ్చర్యంతో డాక్టర్ ముఖంవైపు చూసినాను. డాక్టర్ యేమాలోచిస్తున్నాడో పరధ్యానంగా వున్నాడు.

"యెవరు మూర్తీ ఆ ఆమ్మాయి ?" అని డాక్టర్ నడిగినాను.

డాక్టర్ ఒక క్షణం నా వైపు తీక్షణంగా చూసి విషాదంగా చిరునవ్వు నవ్వుతూ అన్నాడు: "యెవరైతే నేం ? మామూలు పల్లెటూరు మనిషి. ఆ పిల్ల తండ్రి ఒక చిన్నరైతు. యీ వూరుకాదు – పొరుగూరు. పదిరోజులనాడు తండ్రీ బిడ్డా నా దగ్గరికి వచ్చినారు. నిన్న వర్షం వచ్చినందువల్ల పొలంపని చూసుకోడానికి తండ్రి వాళ్ళ ఊరికిపోయినాడు."

"క్షయ ఐతే మరి యిక్కడెందు కున్నది? యెక్కడైనా శానటోరియంకు తీసుకుపొమ్మని చెప్పలేదా నీవు ?" అన్నాను.

"చెప్పడానికేం ? స్విట్జర్లండుకు పొమ్మని కూడా చెప్పవచ్చు. పోవడానికి డబ్బు కావద్దూ ?"

యేమనడానికీ తోచక తలవంచుకున్నాను. డాక్టరే మళ్లీ అన్నాడు: "వాళ్ళు వచ్చిననాడే చెప్పినాను – వెంటనే శానటోరియం పోవలసిన కేసని."

ఆ దివ్యసుందర విగ్రహం నా మనసులో పీఠం వేసుకుంది. తల వంచుకునే అన్నాను: "డబ్బు నేనిస్తాను. ఆ అమ్మాయిని శానటోరియం పంపలేవూ మూర్తీ ?"

ఒక క్షణం నిశ్శబ్దంగా వుండి, "యిటుచూడు" అన్నాడు డాక్టర్. ఊరూ పేరూ తెలియని ఆ అమ్మాయి మీద అంతటి ఔదార్యం కనబరచి నందుకు సిగ్గుపడుతూ తల యెత్తి అతని కండ్లలోకి చూసినాను.

"యెంత మంది క్షయ రోగులను నీ సొంత డబ్బుతో రక్షించ గలవ్ ? దేశంలో యెన్ని లక్షల మంది యెన్నెన్ని రోగాలతో చస్తున్నారో తెలుసునా ? వాళ్ళందరినీ బ్రతికించే శక్తి నీకున్నదా ?" అన్నాడు డాక్టర్.

అతని యెగతాళితో నాలోని అహంకారం పైకి వచ్చి ఆత్మ సమర్థన ప్రారంభించింది. "అందరికీ సహాయం చేయలేనని ఒకరిద్దరికి కూడా చేయవద్దంటావా ?" అన్నాను.

"ఆ అమ్మాయి అందం చూసి నీలో ఔదార్యం అంకురించింది— అంతేకదూ ?"

ఆ ప్రశ్నతో నా వొళ్ళంతా సిగ్గుతో కుంచించుకుపోయింది.

మూర్తి నవ్వుతూ నా వీపుతట్టి "సౌందర్య పక్షపాతం నేరం కాదులే. ఐనా అమ్మాయి సౌందర్యం మన చేతులు దాటిపోయింది. ఒక నెలముందే ఐవుంటే ఆ అమ్మాయిని నేనైనా బ్రతికించ గలిగివుండే వాణ్నే" అంటూ మళ్ళీ ఆస్పత్రిలోకి పోయినాడు.

పరిపరివిధాల ఆలోచనలతో నా మనస్సు సుడిగుండం మాదిరి వుంది. దిక్కు తెలియక రోడ్డు వెంట ఊరి బయటికి దారి తీసినాను. రోడ్డంతా బురద. అక్కడక్కడా గుంతలలో నీళ్ళు. మనస్సులో అర్థమూ గమ్యమూ లేని ఆలోచనలు — ఆలోచనల చుట్టూ ఆవేదన. రోడ్డు

కిరువైపులా పొలంమీద యెద్దులూ మనుషులూ పని చేసుకుంటున్నారు — విత్తనం వేస్తున్నారేమో ? అదేమీ గమనించకుండా రోడ్డు వెంట నడుస్తున్నాను.

తల మాడిపోయే యెండలో ఒక గంటసేపైనా నడచి వుంటాను. అంత యెండలో యెద్దులు పనిచేస్తూనే వున్నాయి — యెద్దుల వలెనే మనుషులు కూడా పని చేస్తున్నారు. యెద్దులకూ మనుషులకూ తేడా యేమీ కనపడడంలేదు. ఆ యెద్దులమీదనైనా ఆ మనుషులకు కనికరం కలగవచ్చు అప్పుడప్పుడూ — కానీ ఆ మనుషులను కనికరించే నాధుడే కనిపించడు. ఈ యెద్దుల మాదిరీ మనుషులు బ్రతికే పద్ధతినేనా పల్లెటూరి ప్రశాంత జీవితమని మన దేశభక్తులు లొట్టలు వేస్తూ వర్ణించేది ? నిజమే — యెద్దుల జీవితం ప్రశాంతంగానే వుంటుంది. కన్నబిడ్డలకు క్షయవస్తే బ్రతికించుకుందామనే ఆరాటం గానీ, బ్రతికించుకో వచ్చుననే జ్ఞానంగానీ లేని యెద్దుల జీవితం ప్రశాంతంగా ఎందుకుండదు !

ఉట్టిపాటుగా వర్షం వచ్చించి. మూడు నిమిషాల్లో తడిపి ముద్దయినాను. అనవసరంగా తెచ్చిపెట్టుకున్న నా అవస్థకు నేనే నవ్వుకొని ఊరి దారి పట్టినాను. హఠాత్తుగా ఒక ఆలోచన వచ్చింది. ఆ అమ్మాయి పరిస్థితి నిజంగా అంత ప్రమాదకరంగా లేదేమో ; నామీద అభిమానంతో - నా డబ్బు ఖర్చు కావడం యిష్టంలేక డాక్టర్ మూర్తి అబద్ధమాడినాడేమో ? త్వరత్వరగా నడుస్తూ ఆస్పత్రి చేరినాను. నా కొరకు యెదురు చూస్తున్న డాక్టర్ వరండాలో వున్నాడు. "మూర్తీ, ఆ అమ్మాయిని వెంటనే మదనపల్లెకు పంపించు - డబ్బు నేనిస్తాను" అన్నాను.

"ఆమె తల్లిదండ్రుల అనుమతి లేకుండానే పంపిస్తావా ?"

"తల్లిదండ్రులు అనుమతి యివ్వరంటావా ? తమ బిడ్డ క్షేమం కోరరూ వాళ్ళు ?"

"యెందుకు కోరరూ? కానీ నీవు క్షేమమనుకున్నదే వాళ్లూ క్షేమ మనుకోవాలి గదూ?"

"యేమిటి మూర్తీ నీవనేది?" అన్నాను విసుగ్గా.

"ఆ అమ్మాయి మొదట వచ్చినరోజే ఆమె తండ్రితో చెప్పినాను — కొన్ని మందులూ, ఇంజక్షన్లూ అర్జంటుగా తెప్పిస్తేతప్ప నేనేమీ చేయలేనని. ఆ తండ్రి యేమన్నాడో తెలుసునా? ఆయుస్సు తీరిన వాళ్ళను మందులూ, ఇంజెక్షన్‌లూ బ్రతికిస్తాయా సార్?" అన్నాడు.

"ఛీ — ఆ తండ్రి మనిషేనా?" అన్నాను తీవ్రమైన అసహ్యంతో.

మూర్తి నావైపు చూసి ఒక విషమహాసం చేసి అన్నాడు: "యేం? పల్లెటూరి రైతులు వేదాంతం మాట్లాడితే అసహ్యంగా వుందా? ఈ వేదాంతం మాట్లాడే మన దేశ నాయకులు విదేశాల్లో కూడా పూలదండలు వేయించుకుంటున్నారు. ఈ వేదాంతం చూసుకునే మాది ఆధ్యాత్మిక దేశమని మన జాతీయ నాయకులు రొమ్ములు విరుచుకొంటున్నారు. ఔన్లే — యీ మాటే గొప్పవాళ్ళు మాట్లాడ్తే నీవూ చప్పట్లు కొట్తావు. కానీ పల్లెటూరువాళ్ళు మాట్లాడ్తే అసహ్యించుకుంటావ్."

ఇటువంటి జవాబు వస్తుందని నే నూహించలేదు. దిగ్భ్రమతో మూర్తి వైపు చూస్తూ నిలబడినాను. మూర్తి జాలిగా నవ్వుతూ నా చేయి పట్టుకొని అన్నాడు: "ఆ అమ్మాయి యిక వారం రోజులు కూడా బ్రతికే ఆశ లేదు. కానీ నీ మనశ్శాంతి కొరకు మదనపల్లెకు పంపించదలచుకుంటే నేనేమీ వద్దనను. ఆమె తండ్రి రేపో, మరునాడో వస్తాడు — మాట్లాడు దాంలే. యిక పోదాం రా, భోంచేస్తాం."

ఆస్పత్రి ప్రక్కనేవున్న డాక్టర్ యింటికిపోయి తడిసిన గుడ్డలు మార్చుకొని భోంచేస్తున్నాము. నేను అడుగుదామనుకొని మరచిపోయిన

ప్రశ్నకు డాక్టరే సమాధానం ప్రారంభించినాడు. "నేనూ ప్రజాసేవ చేయాలనే యీ ఊర్లోనే స్థిరపడిపోయినాను. నా శక్తికొలది రోగులకు ఉచితంగా సేవ చూస్తూనే వున్నాను. కానీ యిదేమీ లాభంలేదు. యిది ప్రజాసేవ అనుకోవడం ఆత్మవంచన."

"అదేమిటి మూర్తీ? రోగులకు ఉచితంగా చికిత్స చేయడం ప్రజా సేవ కాదా?" అని ఆశ్చర్యపడుతూ అడిగినాను.

"నేను యెంత సేవ చేసి యేమి లాభం? ఆ సేవకు ఫలితం వుంటే గదా? ఆ అమ్మాయి ప్రాణం రక్షించగలిగితే గదా నా సేవ ప్రజాసేవ ఔతుంది?"

నాకు అర్థంకాక ప్రశ్నార్థకంగా మూర్తివైపు చూసినాను. అతను యాంత్రికంగా చెప్పుకుపోతున్నాడు: "ఆ అమ్మాయి నిజంగా చావవలసిన అవసరమే లేదు. ఆ అమ్మాయిని రక్షించగల శక్తి వైద్యశాస్త్రానికుంది. ఆ వైద్యశాస్త్రం చదువుకున్న డాక్టర్లూ — నాబోటి వాళ్లు — వున్నారు. ఆ అమ్మాయిని బ్రతికించగల మందులూ దేశంలో వున్నాయి విస్తారంగా. కానీ ఆ అమ్మాయి యిక నాలుగైదు రోజులకంటె యెక్కువ బ్రతకదు. ఆ అమ్మాయి అనవసరంగా మృత్యుదేవతకు ఆహుతి ఔతుంటే అడ్డుపడలేని నా సేవ మానవ సేవ ఔతుందా?"

మూర్తి హృదయంలో యింత వేదన వుందని నే నెన్నడూ ఊహించలేదు. అతని కంఠాన్ని క్రమంగా విషాదచ్ఛాయలు ఆవరించినాయి. "డబ్బును గురించేనా అంటున్నావ్?" అన్నాను.

"అవును. డబ్బులేంది మందులు రావు. డాక్టర్లుకూడా కొందరు రారు. కానీ డబ్బులేకున్నా రోగాలు మాత్రం వస్తాయి. రోగులూ వున్నారు, మందులూ వున్నాయి, డాక్టర్లూ వున్నారు. కానీ వీళ్ళ

కెవ్వరికీ స్వాతంత్ర్యం లేదు — అందరినీ శాసించే హక్కు డబ్బుకు వుంది."

ఆ డబ్బు నా దగ్గరా కొంత వుందన్న సంతృప్తితో "అదంతా ఎందుకులే మూర్తీ. డబ్బు నేనిస్తాను. ఆ అమ్మాయిని బ్రతికించలేవూ ?" అన్నాను.

మూర్తి అదే ధోరణిలో సమాధానం చెప్పినాడు. "నీవంటి దాతలు మన దేశంలో పూర్వం నుండీ వుంటూనే వున్నారు. బలిచక్రవర్తి కాలం నుండీ దాన ధర్మాలు చేస్తూనే వున్నారు. కానీ యెన్ని ధర్మాలు చేసినా దారిద్ర్యం పెరుగుతూనే వుంది. దరిద్రుల సంఖ్య పెరుగుతూనే వుంది. అన్నానికి మొగంవాచిన వాళ్ళ సంఖ్య పెరుగుతూనే వుంది. మందులు కొనలేక మరణాన్నాహ్వానించే వాళ్ళ సంఖ్య పెరుగుతూనే వుంది."

అతని ధోరణేమిటో నాకు అంతుచిక్కలేదు. నా ధ్యాసంతా ఆ అమ్మాయిమీదనే వుంది. "ఆ అమ్మాయి సంగతి చెప్పు మూర్తీ" అన్నాను.

"ఆ అమ్మాయి బ్రతకదని యెన్నిసార్లు చెప్పేది ! ఆమె దగ్గినప్పుడంతా రక్తం పడుతూ వుంది. పోనీ బ్రతికినా ఆ అమ్మాయినొక్కదాన్నే కదా నీ డబ్బు బ్రతికిస్తుంది ? ఆ అమ్మాయిలోని అపురూపమైన అందాన్ని చూసి నీవు డబ్బిస్తున్నావు. కానీ దేశంలోని అమ్మాయిలందరూ వాళ్ళ వాళ్ళ తల్లిదండ్రులకు అపురూపంగానే వుంటారు, అందంగానే వుంటారు. వాళ్ళకూ బ్రతకడానికి హక్కు వుంది. వాళ్లందరి హక్కునూ గుర్తించలేని నీ ఔదార్యం ఔదార్యం కాదు. రోగం వచ్చిన వాళ్ళలో కొంతమందిని బ్రతికించిడానికీ, తక్కిన వాళ్ళకు మరణదండన విధించడానికీ నీ డబ్బుకు రెండధికారాలున్నాయి. మొదటి అధికారం

ఔదార్యమైతే, రెండవది రాక్షసత్వ మౌతుంది."

మూర్తి ధోరణికి నాకీ సారి భయం కలిగింది. మూర్తికి మతి చెడిందా? లేక నాకే మతి చెడిందా? యిక యేం మాట్లాడినా మూర్తి మనస్సు మరీ వికలమౌతుందని మౌనంగా వుండిపోయినాను.

ఫోంచేసిన వెంటనే ఒళ్ళు బాగలేదని సాకు చెప్పి పండుకున్నాను. యెండలో నడిచీ, వర్షంలో తడిసీ నాకు నిజంగానే ఒళ్లు బాగాలేదు. సాయంత్రం మూడు గంటలయ్యే టప్పటికి జ్వరం తగిలినట్లు అనుమానం వచ్చి డాక్టర్‌ను చూడమన్నాను. మూర్తి చూసి రెండు మాత్రలిచ్చి "యేమీ ప్రమాదం లేదులే, కదలకుండా పండుకో" అన్నాడు నవ్వుతూ.

ఆ రాత్రికి జ్వరం యెక్కువైంది. అది నిమోనియానో యేదో. డాక్టర్ నడిగితే "పేరులో యేముందిలే — దిగులు పడకుండా పండుకో" అన్నాడు.

తరువాత నాలుగు రోజులు స్పృహ లేకుండా జ్వరం వచ్చింది. అప్పుడప్పుడూ స్పృహ వచ్చినా ఆ అమ్మాయి విషయం జ్ఞాపకం రాలేదు. ఐదవరోజు ఉదయం జ్ఞాపకం వచ్చి డాక్టర్ నడిగినాను : "ఆ అమ్మాయి యెట్లున్నది మూర్తీ?"

మూర్తి ఒక్క క్షణం తటపటాయించినట్లు కనబడినాడు. తరువాత స్థిరంగా నావైపు చూస్తూ పాఠం అప్పగించినట్లు అన్నాడు : "నీ అందమైన అమ్మాయి చచ్చిపోయింది. నిన్న సాయంత్రం రక్తం కక్కుతూ చచ్చిపోయింది."

(మే 1958)